ప్రజాశక్తి
ఆదివారం 13 ఏప్రిల్ 2025
5
శ్రీకాకుళం

రేపు 'మీకోసం' రద్దు

ప్రజాశక్తి - అరసవల్లి

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు రోజు కావడంతో ఈనెల 14వ తేదీన జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం)ను రద్దు చేసినట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని, సుదూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలకోర్చి రావద్దని కోరారు.

ఎస్.హిమాంజలి
990 / 1000

వై.రోహన్
990 / 1000

పి.శ్రేయ
989 / 1000

ఎల్.తనుష్క
465 / 470

టి.రాజు
465 / 470

పి.యోగితా రాణి
464 / 1000

ఇంటర్‌లో పెరిగిన ఉత్తీర్ణత

- ద్వితీయంలో 74 శాతం
- ప్రథమంలో 63 శాతం మంది పాస్
- రాష్ట్రస్థాయిలో ఫస్టియర్‌లో ఐదో ర్యాంకు
- 990 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన హిమాంజలి, రోహన్
- 465 మార్కులతో ఫస్టియర్‌లో టాపర్‌గా నిలిచిన తనుష్క, రాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, అరసవిల్లి, పొందూరు, ఇచ్ఛాపురం

ఇంటర్ ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే ఉత్తీర్ణతా శాతం గణనీయంగా పెరిగింది. ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించారు. ర్యాంకుల పరంగా చూస్తే ప్రథమ ఇంటర్‌లో రాష్ట్రస్థాయిలో ఐదో స్థానం దక్కగా, ద్వితీయంలో 20వ ర్యాంకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఎపిఎస్‌డబ్ల్యుఆర్), కెజిబివి విదార్థులు 90 శాతం పైగా ఫలితాలు సాధించాయి. మొత్తం ప్రభుత్వ యాజమాన్యం పరిధిలోని కళాశాలలు 72 శాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రైవేట్ కళాశాలలు 74 శాతం ఉత్తీర్ణత సాధించాయి. వ్యక్తిగత మార్కులపరంగా జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ సత్తా చాటారు.

ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 20 వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 17,942 మంది హాజరు కాగా 13,309 మంది (74 శాతం) మంది పాసయ్యారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు మొత్తం 19,693 మంది హాజరు కాగా, 12,478 మంది (63 శాతం) పాసయ్యారు. గతేడాదితో పోలిస్తే రెండింటిలోనూ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.

గతేడాది ఇంటర్ సెకెండ్ ఇయర్‌లో 73 శాతం మంది పాసయ్యారు. ఫస్టియర్‌లో 57 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఒకేషనల్ కోర్సు ఫలితాల్లోనూ పర్వాలేదనిపించారు. ప్రభుత్వ కళాశాలల నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలకు మొత్తం 944 మంది హాజరు కాగా, 712 మంది (75 శాతం) పాసయ్యారు. 1046 మంది ప్రథమ సంవత్సర పరీక్షలు రాయగా, 679 మంది (53 శాతం) ఉత్తీర్ణత సాధించారు.

జిల్లాలో ఇంటర్ ఉత్తీర్ణతా శాతం వివరాలు

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు	శాతం
2021-22	26,052	14,729	57
2022-23	21,752	14,019	64
2023-24	16,769	11,300	73
2024-25	17,942	13,309	74

పలు యాజమాన్యాల కళాశాలలు సాధించిన ఫలితాల వివరాలు

(ఇంటర్ ప్రథమ సంవత్సరం)

కేటగిరీ	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ కళాశాలలు	4,566	2,399	53
సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్	598	469	78
గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్	79	49	62
మోడల్ స్కూల్స్	1096	812	74
కెజిబివి	751	610	81
ప్రయివేట్ కళాశాలలు	11,279	7,276	65

(ఇంటర్ ద్వితీయ సంవత్సరం)

కేటగిరీ	హాజరైన విద్యార్థులు	ఉత్తీర్ణులైన విద్యార్థులు	శాతం
ప్రభుత్వ కళాశాలలు	3,879	2,521	65
సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్	598	469	78
గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్	72	46	64
మోడల్ స్కూల్స్	1001	779	78
కెజిబివి	593	534	90
ప్రయివేట్ కళాశాలలు	10,673	8,064	76

ఎంపిసి విభాగంలో ఇద్దరికి 990 మార్కులు

శ్రీకాకుళం నగరం బలగకు చెందిన శ్రీ చైతన్య కళాశాల విద్యార్థి సాధు హిమాంజలి ఇంటర్ ఎంపిసి విభాగంలో సత్తా చాటింది. 1000 మార్కులకు గానూ 990 మార్కులు సాధించింది. ఈమె తండ్రి సాధు శంకరరావు నగరంలో మెకానిక్‌గా చేస్తున్నాడు. తల్లి హేమలత గృహిణి. ఆర్‌సిఎం స్కూల్‌లో పదో తరగతి చదివి 562 మార్కులు వచ్చాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 470 మార్కులకు గానూ 466 మార్కులు సాధించింది.

పొందూరు పట్టణానికి చెందిన యర్రా రోహన్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో 1000కి 990 మార్కులు సాధించి తన సత్తాను చాటాడు. విజయవాడ శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ చదివిన రోహన్ ఇటీవల విడుదలైన ఐఐటి మెయిన్స్ ఫలితాల్లో 99.466 పర్సన్‌టైల్ సాధించి తన ప్రతిభను కనబర్చాడు. ఈయన తండ్రి కిషోర్ సిమెంట్ వ్యాపారి కాగా, తల్లి కృష్ణశాంతి గృహిణి. ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన రోహన్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

989 మార్కులతో సత్తా చాటిన శ్రేయ

ఇచ్ఛాపురం మండలం తేలుకుంచి గ్రామానికి చెందిన పాల శ్రేయ 989 మార్కులు సాధించింది. ఇచ్ఛాపురంలోని స్వర్ణభారతి విద్యాసంస్థల్లో ఇంటర్ చదివింది. ఈమె తండ్రి కామరాజు రైతు కాగా, తల్లి ఇందిర గృహిణి. ఇంజినీర్ కావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

465 మార్కులతో టాపర్‌గా నిలిచిన తనుష్క, రాజు

ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన లోపింటి తనుష్కకు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గానూ 465 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. విశాఖపట్నంలోని శ్రీ విశ్వ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ కళాశాలలో చదువుతోంది. తనుష్కకు అత్యధిక మార్కులు రావడంపై తల్లిదండ్రులు సంతోష్, స్వాతి, కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఇచ్ఛాపురంలోని ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థి తిప్పన రాజు ఎంపిసిలో 465 మార్కులు సాధించాడు.

ఎంపిసిలో యోగితారాణికి 464 మార్కులు

శ్రీకాకుళం నగరానికి చెందిన పి.యోగితారాణి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గానూ 464 మార్కులు సాధించారు. ఈమె శ్రీకాకుళం నగరంలోనినారాయణ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. తండ్రి పున్నయ్య ట్రాఫిక్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా శ్రీకాకుళం నగరంలో పనిచేస్తున్నారు. సరిగ్గా పదో తరగతి పరీక్షల సమయంలో తల్లి ఉషారాణికి గుండె ఆపరేషన్ జరిగినా ఇంట్లో పనిచేస్తూ పరీక్షలకు సాధన సాగించింది.

బైపిసిలో లక్ష్మీ నిఖిత 988 మార్కులు

రణస్థలంకు చెందిన ఎం.లక్ష్మీ నిఖిత ద్వితీయ సంవత్సరం బైపిసిలో 988 మార్కులు వచ్చాయి. ఈమె శ్రీకాకుళం నగరంలోని శ్రీ చైతన్య కళాశాలలో చదివింది. ఈమె తండ్రి సంజీవి రణస్థలంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. తల్లి హేమవతి గృహిణి. ప్రథమ సంవత్సరంలో 433 మార్కులు వచ్చాయి. రణస్థలంలోని ఆర్‌సిఎం స్కూల్‌లో పదో తరగతి చదివి 579 మార్కులు సాధించారు.

బైసిపి ప్రథమంలో ద్రుషిత్‌కు 434 మార్కులు

శ్రీకాకుళం నగరం బలగకు చెందిన ద్రుషిత్‌కు ప్రథమ సంవత్సరం బైపిసిలో 440 మార్కులకు 434 మార్కులు వచ్చాయి. విద్యార్థి నారాయణ కళాశాలలో ఇంటర్ చదివాడు. తల్లి శ్రీరాజరాజేశ్వరి రేడియోలజీ డాక్టర్‌గా పనిచేస్తున్నారు. విశాఖలోని శ్రీ ప్రకాష్‌లో సిబిఎస్‌ఇ చదివి 473 మార్కులు వచ్చాయి.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి నర్సింహారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాట్లాడుతున్నసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహారావు

రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించి, గతంలో ఉన్న సంక్షేమ పథకాలను అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వి.నర్సింహారావు డిమాండ్ చేశారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీలో సమావేశంలో ఆయన మాట్లాడారు. టిడిపి కూటమి ఎన్నికల సమయంలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి, పెండింగ్ క్లయిమ్స్ పరిష్కరిస్తామని మేనిఫెస్టోలో పేర్కొందని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఆ హామీలు అమలుకు నోచుకోలేదని, కార్మికులపై ప్రభుత్వ వైఖరి అర్థమవుతోందన్నారు. కార్మిక వర్గాన్ని నమ్మించి మోసగించడం పాలకులకు పరిపాటిగా మారిందన్నారు. సంక్షేమ బోర్డుని పునరుద్ధరించి, పెండింగ్ క్లయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల అమలు కోసం వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికే ఖర్చు చేయాలన్నారు. ఈ నిధులను ప్రభుత్వాలు పలు సందర్భాల్లో దారిమళ్లించాయని, వాటిని తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికుల్లో సొంతింటి నిర్మాణానికి వెల్ఫేర్ బోర్డు నుంచి రాయితీపై రుణం ఇవ్వాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధంగా భవన నిర్మాణాల కార్మికులకు మెరుగైన సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్ అందించాలని, కార్మికుల పనికోసం వేచి ఉండే ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. నిర్మాణం పనులకు ఉపయోగించే వస్తువులపై (ముడిసరుకులు) జిఎస్‌టిని తగ్గించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమవుతున్న లేబర్ కోడ్‌లు భవన నిర్మాణ కార్మికులకు నష్టదాయకం కానున్నాయన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరనాథరావు, గౌరవాధ్యక్షులు ఎం.ఆదినారాయణ మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, సంఘ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆఫ్‌షోర్ ఊతం

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - పలాస

సాగు, తాగునీటి సమస్యల పరిష్కారానికి కీలకమైన ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, జిల్లా అభివృద్ధికి మరింత ఊతమిస్తుందన్నారు. ఆఫ్‌షోర్ ప్రాజెక్టు ప్రాంతాన్ని పలాస, పాతపట్నం ఎమ్మెల్యేలు గౌతు శిరీష, మామిడి గోవిందరావుతో కలిసి శనివారం సందర్శించి, అధికారులతో సమీక్షించారు. నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించిన అనంతరం, రేగులపాడు వద్ద రైతులతో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడారు.నిర్వాసితులందరికీ పూర్తిస్థాయి నష్టపరిహారం అందించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ప్రాజెక్ట్ పరిధిలోకి వచ్చిన గ్రామాల్లో ప్యాకేజీ మంజూరు కాలేకపోయిన 130 మందికి త్వరలో పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సవర చీపురుపల్లిలోని 14 ఎకరాలకు సంబంధించిన పరిహారం, డబుల్ పేమెంట్లు, డి-పట్టాలకు సంబంధించి చెల్లింపులపై సమీక్ష నిర్వహించి తక్షణ నిర్ణయాలు తీసుకుంటామన్నారు. దేవాలయ భూములకూ పరిహారం విషయాన్ని పరిశీలిస్తామని హామీనిచ్చారు. ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని సూచించిన మంత్రి, వచ్చే మూడు నెలల్లో ఏడున్నర లక్షల మీటర్లు, ఏడాదిలో 17 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. బిల్లుల క్లియరెన్స్ విషయమై స్వయంగా బాధ్యత తీసుకుంటానన్నారు.

ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో మౌలిక వసతులు

నిర్వాసిత గ్రామాల్లో మౌలిక వసతును మూడు నెలల్లో కల్పిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నిర్వాసిత గ్రామాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబంధించి నిర్వాసితులకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, టెక్కలి, పలాస ఆర్‌డిఒలు కృష్ణమూర్తి, వెంకటేష్, పలువురు ఇంజినీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కాకరాపల్లి పవర్‌ప్లాంట్ చిమ్నీ నేలమట్టం

ప్రజాశక్తి - నౌపడ

సంతబొమ్మాళి మండలం కాకరాపల్లి పవర్ ప్లాంట్ నిర్మాణంలో భాగంగా నిర్మించిన 173 అడుగుల చిమ్నీని (పొగ గొట్టం) శనివారం నేలమట్టం చేశారు. ఓ ప్రైవేట్ కంపెనీ పేలుడు పదార్థం ఉపయోగించి దీన్ని కూలివేసినట్లు సమాచారం. 2009లో పవర్‌ప్లాంట్ నిర్మాణంలో భాగంగా ఈ చిమ్నీని నిర్మించారు. అప్పట్నుంచి 3,350 ఎకరాల్లో ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించి క్రమంగా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్‌లు, ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, వరదనీటి తరలింపు, స్టీల్ కాంక్రీట్ పనులు చేపట్టారు. కాకరాపల్లి పవర్‌ప్లాంట్‌కు వ్యతిరేకంగా స్వదేశీ మత్స్యకారులు చుట్టుపక్కల గ్రామస్తులు తీవ్రంగా వ్యతిరేకించడంతో అప్పటి పోలీసు కాల్పుల్లో ముగ్గురు మృతి చెందారు. తర్వాత పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని ఆపాలని, 1108 జిఒ రద్దు చేయాలని ఉద్యమకారులు పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టారు. మూలపేట పోర్టు నిర్మాణానికి దగ్గర్లోనే ఉన్న కాకరాపల్లి పవర్ ప్రాంతం ఇతర పరిశ్రమలకు ఉపయోగించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా సంబంధిత ప్రైవేట్ కంపెనీ చిమ్నీని కూల్చివేసేందుకు మొదటిసారి ప్రయత్నించి అనుమతి లేక ఆపేసింది. రెండోసారి చుట్టుపక్కల గ్రామస్తులకు సమాచారం ఇచ్చి అటువైపు ఎవరు వెళ్లకుండా కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3.30 గంటలకు చిమ్నీని పూర్తిగా నేలమట్టం చేశారు. చిమ్నీ కూలినప్పుడు దట్టమైన ధూళి, పొగతో ఆ ప్రాంతమంతా నిండిపోయింది. పవర్ ప్లాంట్ నిర్మాణంలో సుమారు 15 కిలోమీటర్ల నుంచి కూడా కనిపించి, ప్లాంట్ గుర్తుగా ఉన్న చిమ్నీ శనివారంతో నేలమట్టమైంది.

నేలమట్టమవుతున్న పవర్ ప్లాంట్ చిమ్నీ

కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - అరసవల్లి

కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కోర్టు విధుల్లో ఉండే కోర్టు ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్ళ ప్రతిభ కనబరచాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి కోర్టు లైజినింగ్ అధికారులకు సూచించారు. పోలీస్ శాఖలో కోర్టు కానిస్టేబుళ్ల పాత్ర చాలా కీలకమన్నారు. జిల్లావ్యాప్తంగా పలు కోర్టుల్లో విధులు నిర్వహిస్తున్న కోర్టు ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లతో జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాలకు పాల్పడిన నిందితులకు శిక్ష పడినప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. సాక్షులను సకాలంలో న్యాయస్థానంలో హాజరు పరుస్తూ కోర్టు కానిస్టేబుళ్ళ తీసుకోవాల్సిన చొరవే అతి ముఖ్యమైందని తెలిపారు. కోర్టు జారీ చేసిన వారెంట్లు, సమన్లు నేరస్తులకు సత్వరమే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కోర్టు ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత సిఐలు, ఎస్‌ఐలకు తె లి య ం జే య ా ల ని సూచించారు. కేసు ట్రయల్స్ సమయంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సలహాలు, సూచనలు స్వీకరించాలని ఆదేశించారు. కోర్టు పెండింగ్ ట్రయల్ కేసులు, వారెంట్లు, సమన్లు, సిసిటిఎన్ఎస్ అప్లికేషన్, కోర్టు మానిటర్ సిస్టమ్‌లో డేటా ఎంటర్ చేయాలన్నారు. సమావేశంలో కోర్టు మానిటరింగ్ సిస్టమ్ ఎస్‌ఐ కోటేశ్వరరావు, ఎఎస్‌ఐలు, కోర్టు హెడ్ కానిస్టేబుళు ,, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

'ఉపాధి' చట్టంపై నేతల అక్కసు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై రాజకీయ పార్టీల నాయకగణం ఎప్పటికప్పుడు తమ అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. వైసిపి, టిడిపి నేతలు ఏదో ఒక సందర్భంలో వాటిపై వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. కొందరు నేతలు బాధను గొంతులోనే దిగుమింగుతుండగా, మరికొందరు బయటకు వెళ్లగక్కుతున్నారు. ఇటీవల జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ఎచ్చెర్ల ఎంపిపి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు రాజకీయ నేతల ముసుగులో ఉన్న భూస్వాముల మనస్తత్వానికి అద్దం పడుతున్నాయి. చెరువు గట్టుపై కూర్చొని కాలక్షేపం చేస్తున్న ఉపాధి కూలీలకు పనిచేయకుండానే డబ్బులు ఇచ్చేస్తున్నారంటూ తెగ బాధ పడిపోయారు. దీనివల్ల దేశవ్యాప్తంగా రూ.లక్షల కోట్లు వృథా అవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పనుల వల్ల వ్యవసాయ పనులకు కూలీలు దొరకడం లేదంటూ ఆక్రోశం వెళ్లగక్కారు. వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడూ తన మనసులోని మాటను బయటకు చెప్పేశారు. తామూ చాలా కాలంగా అదే చెప్తున్నామని, వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి చెప్తున్నా జరగడం లేదని, ఇప్పుడు ఉద్యాన పంటలకు ఉపాధి హామీని అనుసంధానం చేయడం కొంత ఉపశమనమని బదులిచ్చారు. గత ప్రభుత్వంలో డిప్యూటీ సిఎంగా ఉన్న ధర్మాన కృష్ణదాస్ కూడా ఇవే తరహా వ్యాఖ్యలు చేశారు. ఉపాధి హామీ వల్ల కూలీలంతా సోమరిపోతులుగా మారిపోతున్నారనేది అంతర్గతంగా అందరి నేతల మాటల్లోనూ కనిపిస్తోంది. చంద్రబాబు మాటల్లో చెప్పాలంటే సంపద సృష్టికి కూలీలే కారకులన్న కీలక అంశాన్ని నేతలు విస్మరిస్తున్నట్లుగా కనిపిస్తోంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలోనూ వారి భాగస్వామ్యం ఉందనే వాస్తవాన్ని వారు గుర్తించినట్లు లేదు. ఉపాధి పనులు చేసినందుకు కూలీలకు 60 శాతం మేర డబ్బులు ఇస్తుంటే, మిగిలిన 40 శాతం డబ్బులను మెటీరియల్ కాంపొనెంట్ పనుల కోసం వెచ్చిస్తున్నారు. వాటితోనే గ్రామాల్లో సిసి రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు, చివరకు శ్మశానాలకు రహదారుల నిర్మాణం వంటి పనులు మెటీరియల్ కాంపొనెంట్ నిధులతోనే చేపడుతున్నారు. ఈ పనులకు కాంట్రాక్టర్లుగా వ్యవహరిస్తోంది గ్రామస్థాయిలో ప్రధాన పార్టీ నాయకులే. కూలీలు పనిచేయడం ద్వారా పరోక్షంగా కాంట్రాక్టర్లు ఆదాయం పొందుతున్నారన్న మాట. ఉపాధి పనులకు వెళ్లిపోవడం వల్ల వ్యవసాయ పనులకు కూలీలు రావడం లేదనేది రాజకీయ పార్టీల నేతలు చాలా కాలంగా బాధపడిపోతున్నారు. పోనీ వీరు ఏడాదంతా పనులు కల్పించగలరా అంటే అదీ లేదు. వ్యవసాయ సీజన్‌లో మాత్రమే పనులు ఇచ్చి, తర్వాత పొమ్మంటున్న పరిస్థితి గ్రామాల్లో నెలకొంది. ఉపాధి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో కూలీలకు కొంతమేర ఆర్థిక స్వేచ్ఛ వచ్చింది. గతంలో మాదిరి అప్పుల కోసం భూస్వాములపై ఆధారపడుతున్న పరిస్థితి అంతగా ఉండడం లేదు. కూలీలపై క్రమేణా తమ పెత్తనం పోతుందనే భయం భూస్వాముల్లో కనిపిస్తోంది. దీంతో పలురకాల వేదికల్లో రాజకీయ నాయకుల నుంచి ఉపాధి చట్టంపై ఈ తరహా వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అధికారం తలకెక్కిందో, తమకు ఏది వచ్చినా పార్టీ పెద్దలు, ప్రభుత్వం చూసుకుంటుందన్న అపోహ ఏమో గానీ టిడిపికి చెందిన కొందరు నాయకులు ఇటీవల నోరు జారుతున్నారు. సంతబొమ్మాళి మండల టిడిపి అధ్యక్షుడు జీరు భీమారావు జిల్లా ఉన్నతాధికారులపై చేసిన పరుష వ్యాఖ్యలు అందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. సంతబొమ్మాళి చేపల కట్టు వేలం పాటకు సంబంధించి వివాదం సందర్భంగా కలెక్టర్, ఆర్‌డిఒ వీపు బద్దలు కొడతానంటూ నోటికొచ్చినట్లు మాట్లాడటం అందరినీ నివ్వెరపరిచింది. మూలపేట పోర్టు ఆర్ అండ్ ఆర్ లాటరీ తీయడానికి వాడెవడు అంటూ ఆర్‌డిఒను దూషించడం బరితెగింపునకు నిదర్శనం. సంతబొమ్మాళి పోలీస్‌స్టేషన్‌లో సిఐ, ఎస్‌ఐల సమక్షంలో రెచ్చిపోవడం అధికారం ఉందన్న అహంకారమే తప్ప మరొకటి కాదు. దీనిపై పోలీసులు కేసు కూడా నమోదు చేయలేదంటే రాజకీయ కారణాలు తప్ప మరొకటి కాదనేది తెలుస్తోంది. ఉన్నతాధికారులను అంతలా దూషించిన వ్యక్తి టిడిపి నాయకుడు కావడం, మంత్రి అచ్చెన్నాయుడు ప్రధాన అనుచరుడు కావడం తప్ప మరొకటి కాదనేది అందరికీ తెలిసిందే. తర్వాత ఏమైందో ఏమో గానీ మరుసటి రోజు తాను చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పారు. క్షమాపణ చెప్తే చేసిన తప్పు సమసిపోతుందంటే వైసిపి నేతలు కూడా గతంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్‌పై తాము చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చేప్పేందుకు సిద్ధంగానే ఉంటారు. మరి వారిని వదిలేస్తారా?. ఇప్పటికే ఆ పార్టీకి చెందిన నాయకులపై రాష్ట్రంలోని మారుమూల ప్రాంత పోలీస్‌స్టేషన్లలో సైతం కేసులు పెట్టి రాష్ట్రవ్యాప్తంగా తిప్పుతున్న పరిస్థితిని చూస్తున్నాం. చట్టం ముందు అందరూ సమానులే, చట్టం తన పని తాను చేసుకువెళ్లిపోతుందంటూ యధాలాపంగా స్టేట్‌మెంట్లు ఇచ్చే ప్రభుత్వ పెద్దలు, ఈ విషయంలో సొంత పార్టీ నేతల జోలికి వెళ్లకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. జిల్లా మెజిస్ట్రేట్, ఆర్‌డిఒపై టిడిపి మండల నాయకుడు అంతలా విరుచుకుపడితే మండల స్థాయిలో పనిచేసే తహశీల్దారు, ఎంపిడిఒ ఇతర ఉద్యోగుల పరిస్థితి ఏమిటి?. వారు స్వేచ్ఛగా ఏం పని చేయగలరు?. రెండు వేల మందితో వస్తాం... లెక్కలు చెప్పకపోతే చంపేస్తామంటూ సిఐ, ఎస్‌ఐలను పోలీస్‌స్టేషన్‌లో హెచ్చరించినా వారు చేష్టలుడిగి చూడడం తప్ప ఏమీ చేయలేని నిస్సహాయతా?, లేదా అధికార పార్టీ నాయకుడి జోలికి వెళ్లకూడదనుకున్నారా?. కూటమి నేతల ఆగడాలు ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్తాయి. పోలీసులు ఇప్పటికైనా నిష్క్రియాపరత్వాన్ని వీడి చర్యలు చేపట్టాల్సి ఉంది. మరోవైపు మంత్రి అచ్చెన్నాయుడు సహా ఇతర కూటమి ప్రజాప్రతినిధులు ఇటువంటి తరహా ఘటనలను ఉపేక్షించకూడదు. తమ పార్టీ నాయకుడు, కార్యకర్త అని వదిలేస్తే ఇటువంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం లేకపోలేదు. అధికారులు, ఉద్యోగులపై దూషణలు, దాడులకు పాల్పడితే అది వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతిసే అవకాశం ఉంది. ఇది పాలనపై ప్రభావం చూపుతుంది. అంతిమంగా కూటమి ప్రభుత్వానికి నష్టం కలిగిస్తుంది.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాకుళం వారి కోర్టులో
OS. NO: 69/2024

Between:-
Life cell International Private Limited Chennai, Rep by Mr. Bhargav (Executive Admin) ......plaintiff
And:-
Health care solutions Rep by Arigela Venkata Seshu .....Defendant

To,
Arigela Venkata Seshu, C/o T. Raju, plot no 19 Dharmasastra Nagar, Adivarampeta, Srikakulam, pin 532001, Andhra Pradesh.

ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన ప్రతివాది మీ పైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాకుళం వారి కోర్టులో రికవరీ ఆఫ్ అమౌంట్ కేసు వేయడ మైనది. ప్రతివాదికి కోర్టు ఉత్తర్వుల ప్రకారం **తేది 29-04-2025. న వాయిదా ఉన్నది.** మీరు స్వయంగా గాని అడ్వకేట్ ద్వారా గాని **ఉదయం 10.30 గంటలకు** ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టుకు హాజరు కావాల్సిందిగా తెలియ జేయడమైనది. లేనియెడల మీ పరోక్షంగా కేసును నిర్ణయించబడునని మీకు తెలియజేయడమైనది.

అన్నెపు సత్యనారాయణ
అడ్వకేట్,
శ్రీకాకుళం, సెల్: 9440447646

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. టెక్కలి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి తమ సమస్యలు విన్నవించారు. మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి వీలున్నంత త్వరగా ప్రజలకు మేలు చేసేవిధంగా సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విధుల్లో అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రధానంగా నూతన నివాసాలు, పింఛన్లు, ఉపాధి అవకాశాలు, రహదారులు మంజూరు చేయాలని ప్రజలు కోరారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన నిధులు ఉన్నాయని, ఇప్పటికే నిధులు మంజూరు చేయడం జరిగిందని ఇచ్చిన సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. నూతన పనుల కోసం ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు. కాగా సంతబొమ్మాళి మండలం లక్కివలస పంచాయతీ గెద్దలపాడుకు చెందిన మత్స్యకారులు సముద్ర తీరంలో లంగరు వేసిన ఇంజిన్ బోటు ఇటీవల ధ్వంసం కావడంతో నష్టపరిహారం అందజేయాలని కోరారు.

'ప్రజాశక్తి' విలేకరి సత్యంకు ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

సామాజిక కోణంలో అనేక కథనాలు రాస్తూ, తన వార్తలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న 'ప్రజాశక్తి' కవిటి మండల విలేకరి పూడి సత్యనారాయణకు ఉగాది పురస్కారం వరించింది. తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన వేడుకలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వి.రమణ చేతుల మీదుగా సత్యనారాయణకు ఉగాది పురస్కారం అందించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు రివార్డుతో పాటు రూ.20 లక్షల బీమా సదుపాయం, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు. అనంతరం రమణ అప్పట్లో తాను పాత్రికేయ రంగం పనిచేసిన అనుభవాలు, జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు.

విలువలతో కూడిన పాత్రికేయులకు సమాజంలో ఎప్పుడూ గౌరవం ఉంటుందన్నారు. పాత్రికేయ రంగంపై ఉన్న అపోహలు తొలగించాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉందన్నారు. ఇరు రాష్ట్రాల ఉత్తమ పాత్రికేయులకు ఉగాది పురస్కారాలతో సత్కరిస్తున్న తెలుగు జర్నలిస్టుల సంక్షేమ సంఘం భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు, ప్రముఖ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, యువ నటుడు, హీరో కంచర్ల ఉపేంద్రబాబు, సమాజ సేవకుడు ఎబిఎస్ టి.ఎ.దర్బార్ - జంపని వ్యవస్థాపకుడు అంతా మహమ్మద్ నిజాముద్దీన్ నిజమీ షా తాజ్ ఖాదరి (అతా నిజాం బాబా), ఈదా స్పందన ఇంటర్నేషనల్ ఫౌండేషన్ చైర్మన్ శ్యాముల్ రెడ్డి, అఖండ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విన్నకోట సురేష్, ఎపిఆర్‌డి ఆర్గనైజేషన్ స్టేట్ కో-ఆర్డినేటర్ కుమారి సగం శిల్పా ప్రియాంక, జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఇరు రాష్ట్రాల కార్యవర్గ సభ్యులు, ఇరు రాష్ట్రాల పాత్రికేయులు పాల్గొన్నారు.

'సూర్యతేజ' విజయభేరి

శ్రీరాగసుధ దివ్య ప్రియాంక

కావ్య లక్ష్మీప్రియ మనీషా

విద్యార్థులతో పద్మాజీ

ప్రజాశక్తి- పలాస

ఇంటర్ ఫలితాల్లో పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో సూర్యతేజ కళాశాల విజయభేరి మోగించింది. 92 శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు తమ సత్తా చాటారు. బైపిసిలో గొట్టాపు ప్రియాంక 989 మార్కులు కళాశాల టాపర్‌గా నిలిచారు. ఎంపిసిలో బేవర శ్రీరాగ సుధ 988 మార్కులు సాధించి విజయ ఢంకా మోగించారు. హెచ్‌సిలో కొనారి లక్ష్మీప్రియ 975 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో 989 నుంచి 980 వరకు 14 మంది, 980 నుంచి 900 మార్కులు పైబడి 48 మంది, 989 నుంచి 900 వరకు 62 మంది విద్యార్థులు మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపిసిలో ఇంజరపు కావ్య 463 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. బైపిసిలో 430 మార్కులతో గోంటి దివ్య, హెచ్ఇసిలో 477 మార్కులతో పిలక మనీషా ఉత్తమ ఫలితాలు సాధించారు. మొదటి సంవత్సరంలో 463 నుంచి 400 మార్కులు పైబడి 68 మంది ఉత్తమ ప్రతిభ కనబరచగా, 92 శాతం ఉత్తీర్ణత శాతంతో ప్రతిభ చాటారు. విద్యార్థులు సాధించిన విజయంపై కళాశాల ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ దానేటి పద్మాజీ కామేశ్వరరావు మాట్లాడుతూ ఇంతటి విజయం అందించిన విద్యార్థిలకు, వారి తల్లితండ్రులకు, అధ్యాపక సిబ్బందికి అభినందనలు తెలియజేశారు.

సాయివినీత్ విద్యార్థుల విజయదుందుభి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పూండిగోవిందపురం సాయి వినీత్ విద్యా సంస్థల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో విజయ దుందుభి మోగించారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు 13 మంది 900 మార్కులకు పైబడి సాధించారు. ప్రథమ సంవత్సర విద్యార్థులు 32 మంది 400కు పైబడి మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరంలో 91.12 శాతం, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 70.45 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అన్నెపు కైలాష్‌రావు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సంస్థ వ్యవస్థాపకులు, విశ్రాంతి డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ కె.లీల్, డాక్టర్ చాపర కోదండరావు అభినందనలు తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో సైని ప్రీతి 979, కళ్యాణి 976, కారి యామిని 974, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో అట్టాడ అమృత 460, తులే శ్రావణి 459, అమర లత 453, గండేటి శ్రావణి 451, బైపిసిలో వంక ప్రమీల 422 మార్కులు సాధించారు. వెనుకబడిన అక్షరాశ్యత శాతం తక్కువగా ఉన్న ఉదానం, తీర ప్రాంత గ్రామాల్లో అతి తక్కువ ఫీజుతో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు సాయివినీత్ విద్య సంస్థ కృషి చేస్తుందని వ్యవస్థాపకులు తెలిపారు.

ప్రీతి (979) కళ్యాణి (976) యామిని (974)

శ్రావణి (459) ప్రమీల (422) అమృత (460)

'విద్యావాహిని' విద్యార్థుల ప్రతిభ

అభినందిస్తున్న యాజమాన్యం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ విద్యావాహిని కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. సకలభక్తుల వంశీ విభిన్న ప్రతిభావంతుడు 454 మార్కులు సాధించి తన సత్తా చాటుకున్నాడు. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో కాశీబుగ్గ శ్రీవిద్య వాహిని జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సర ఎంపిసి పల్లి ప్రవళిక 987 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది.

మద్దిల రేష్మ 984 అత్యధిక మార్కులు సాధించారు. 900 మార్కులు పైబడి సుమారు 35 మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి ప్రతిభ కనబరిచారు. ప్రథమ సంవత్సర ఎంపిసి బందాపు పూజిత 457 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. సకలభక్తుల వంశీ విభిన్న ప్రతిభావంతుడు అయినా పట్టుదలతో చదివి 454 మార్కులు సాధించి పలువురిని ఆశ్చర్యానికి గురిచేశాడు. బైపిసి విభాగంలో శిష్టు రాకేష్ 426, పోందర చార్మి పాత్రో 422, 400 మార్కులు పైబడి సుమారు 30 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అత్యధిక మార్కులు, ఉత్తీర్ణత శాతం సాధించినందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆయుధం గిరిబాబు, జూనియర్ కళాశాల ఎఒ పైల మన్మథరావు అభినందించారు.

'స్వర్ణభారతి' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

2024-25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక స్వర్ణభారతి జూనియర్ కాలేజ్ విద్యార్థులు సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో పాల శ్రేయ 989, మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకును సాధించింది. అన్వేష త్రిపాఠి 980, పిట్ట లావణ్య 978, శ్రావణ్ 973 మార్కులను సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కె.కుసుమ 458, ఇ.గీత 457, డి.దీపిక 453, గీతాంజలి రానా 423, బైపిసిలో అయేషా 423, డి.దేవి 421 మార్కులతో ప్రతిభను కనబరిచారు. వీరిని చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, ఇన్‌ఛార్జి చాట్ల రామురెడ్డి, ప్రిన్సిపాళ్లు జల్లు జయప్రకాష్, కె.సందీప్ అభినందించారు.

శ్రేయకు స్వీట్ తినిపిస్తున్న తులసీదాస్‌రెడ్డి

శాంతినికేతన్ విద్యార్థుల హవా

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నగరంలోని శాంతినికేతన్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ఎంపిసిలో 986 మార్కులతో లుకలాపు ఢిల్లీశ్వరి, 980 మార్కులతో పాలవలస భవానీ నిలిచారు. వారితో పాటు 30 మంది విద్యార్థులకు 900 పైబడి మార్కులు వచ్చాయని కళాశాల డైరక్టర్లు కొర్ను పావని, కొర్ను ప్రతాప్, ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. ప్రథమ ఇంటర్‌లో బైపిసిలో ఆట్ల మనస్విని 440 మార్కులకు 432 మార్కులు సాధించింది. అలాగే రేవళ్ల రాజు 420 మార్కులు సాధించాడు. ఎంపిసిలో మువ్వల యశ్వంత్ 460 మార్కులు సాధించగా పున్నాన మేఘన, బైనపల్లి బాలకృష్ణలు 458 మార్కులు సాధించారు. వారికి డైరక్టర్లు, ప్రిన్సిపాల్ అభినందించారు.

సత్తాచాటిన 'చైతన్య సహకార' విద్యార్థులు

సోనియా స్వాతి

శ్రీకాకుళం అర్బన్ : ఇంటర్మీడియట్ బోర్డు శనివారం వెల్లడించిన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో నగరంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను అందుకున్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎంపిసిలో 966 మార్కులతో జె.సోనియా, 959 మార్కులతో ఆర్.దుర్గాప్రసాద్, సిహెచ్.స్వాతి 944 మార్కులు సాధించారు. అలాగే బైపిసిలో 938 మార్కులతో ఎం.స్వాతి, 922 మార్కులతో ఎన్.రాజు నిలిచారు. వారితో పాటు ప్రథమ సంవత్సరానికి 452 మార్కులతో ఎం.సంజన, 450 మార్కుల తో ఎస్.గిరీష, 447 మార్కులతో బి.రేవంత్ గుప్త నిలిచారు. ప్రథమ సంవత్సరంలో 400 పైబడి మార్కులు 13 మంది సాధించారని కళాశాల డైరెక్టర్ జామి భీమశంకరరావు, ప్రిన్సిపాల్ రౌతు శ్రీనివాసరావు తెలిపారు. ద్వితీయ సంవత్సరానికిగాను 13 మంది 900 పైబడి మార్కులు సాధిం చారని వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించి న విద్యార్థులకు ప్రిన్సిపాల్ అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థులు...

ఇచ్ఛాపురం : ఇంటర్మీడియట్ పలితాల్లో స్థానిక ఆదిత్య జూనియల్ కాలేజ్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపిసిలో తిప్పన రాజు 465 మార్కులు సాధించి ఇచ్ఛాపురం నియోజకవర్గం లో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. గణల రెస్మా 463, లిస్స బెహరా 462, ఎన్.భాగ్యవతి 460, బైపిసిలో ఆసి దివ్య 424 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో సంతోషిభవానీ 987, షేక్ రుక్మిద్ 982, లాడి దీపిక 981 మార్కులు సాధించారు. ఎంపిసిలో నెయ్యల భవ్యశ్రీ 987, దక్కత శైలు 985, కొంతల విద్య 984, అర్.మేఘన 983, ఎస్.కావేరి 981 మార్కులు సాధించారు.

మెరిసిన 'పద్మావతి' విద్యార్థులు

నరసన్నపేట : స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచారు. ఎంపిసి విభాగానికి చెందిన పి.అనిల్ కుమార్ 463 మార్కులు సాధించగా, పాగోటి సుశీల పల్లవి 460 మార్కులు సాధించింది. బైపిసి విభాగం నుంచి చల్ల చాందిని 440 మార్కులకు 428 మార్కులు సాధించింది. విద్యార్థులను కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్ అభినందించారు.

పుష్పగుచ్ఛం అందజేస్తున్న దుర్గాప్రసాద్

'ఆదిత్య' విద్యార్థుల హవా

శ్రీకాకుళం : ఇంటర్ ఫలితాల్లో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు విజయం సాధించారు. జూనియర్ ఎంపిసిలో **వి.**గాయత్రి లక్ష్మి 464/470, పి.సాయికిరణ్ 462/470, వి.రుషిత 461/470 సాధించారు. 460 మార్కులు పైబడి 9 మంది విద్యార్థులు విజయం సాంధించారు. బైపిసిలో నిఖిత 428/440, మాదవి 426/440, లాస్య ప్రియ 426/440 సాధించారు. 420 మార్కులు పైబడి 8 మంది విద్యార్థులు విజయం సాధించారు.సీనియర్ ఎంపిసిలో ఎం.వాసవి 984/1000, బి.తనూజ 983/1000, ఎస్.భార్గవి 982/1000 సాధించారు. 980 మార్కులు పైబడి 10 మంది విద్యార్థులు విజయం సాంధించారు. బైపిసిలో పి.చాందిని 974/1000, సిహెచ్ కీర్తి 972/1000 సాధించారు. 970 మార్కులుపైబడి ఏడుగురు విద్యార్థులు విజయం సాంధించారని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఢిల్లీశ్వరరావు తెలియజేశారు. ఇంతటి విజయానికి కారణమైన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక సిబ్బందికి, కళాశాల సిఇఒ పి.రామారావు, కళాశాల డైరక్టర్ బి.ఎస్. చక్రవర్తి అభినందనలు తెలిపారు.

ప్రైవేట్ కళాశాలల ప్రభంజనం

విద్యార్థులను అభినందిస్తున్న కళ్యాణి కళాశాల సిబ్బంది

కవిటి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో స్థానిక కళ్యాణి జూనియర్ కళాశాలకు చెందిన గుడియా హేమలత ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో (987) మార్కులతో నియోజకవర్గస్థాయిలో రెండో స్థానం సాధించారు. మొదటి ఏడాది ఎంపిసికి చెందిన పిరియా సాత్విక (460) మార్కులతో మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచింది. మొదటి ఏడాది బైపిసిలో టి.శైలజ (429), రెండో ఏడాది బైపిసిలో పి.చాందిని (954) మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులను అభినందించారు. మొదటి సంవత్సరంలో 75 శాతం, ద్వితీయ సంవత్సరంలో 85 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు కళ్యాణి కళాశాల ప్రిన్సిపాల్ శంకరావు తెలిపారు. అదే విధంగా కవిటి కొత్తూరులోని బిఎస్ఆర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో వజ్జ స్వాప్నిక (962), బడే రాజేశ్వరి (919) మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో దున్న బెనర్జీ (470) మార్కులతో సత్తా చాటారు. స్థానిక ఎస్‌విజె విద్యా సంస్థలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం బైపిసిలో పి.గాయత్రి (941), పి.పల్లవి (849) మార్కులు సాధించారు. మొదటి ఏడాది ఎంపిసిలో పి.నవ్య (310) మార్కులు సాధించారు.

ఉపాధి కూలీలపై నిర్లక్ష్యం వీడాలి

వ్య.కా.స జిల్లా ప్రధాన కార్యదర్శి సింహాచలం

ప్రజాశక్తి- బూర్జ

ఉపాధి కూలీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారావు సింహాచలం అన్నారు. శనివారం మండలంలోని అన్నంపేటలో ఉపాధిహామీ పని ప్రదేశంలో కూలీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కేంద్రం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పటికీ ఉపాధి కూలీలపై నిర్లక్ష్య వైఖరి చూపుతున్నారన్నారు. 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజురోజుకి నిత్యవసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నా ఉపాధి కూలీలకు మాత్రం కనీస వేతనం ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ.600తో పాటు, వందల రోజుల పని కల్పించాలని, పని ప్రదేశంలో మంచినీళ్లు, టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో మామిడి ఆదినారాయణ, సైలాడ మీనాక్షి, ఎస్.రాజేశ్వరి, కందల దివ్య, కుప్పిలి చంటి, దంత జ్యోతి, కరణం రామకృష్ణ, జి.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న సింహాచలం

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ముగిసిన ఉత్సవాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఉత్సవాల నిర్వహణతో ప్రజల్లో సమిష్టి భావన కలుగుతుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని నువ్వలరేవులో శనివారం నిర్వహించిన శ్రీరామ నవమి ఉత్సవాలు ముగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామమంతా కలిసికట్టుగా సామూహికంగా ఉత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మువ్వల పూర్ణచంద్రరావు, సొసైటీ అధ్యక్షుడు బెయినపల్లి నవీన్, టిడిపి మండల అధ్యక్షులు సురాడ మోహనరావు, అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు పాల్గొన్నారు.

డిఎస్‌పి సందర్శన

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కాశీబుగ్గ డిఎస్‌పి వి.వెంకట అప్పారావు అన్నారు. మండలంలోని నువ్వలరేవులో శ్రీరామ నవమి ఉత్సవాలు శనివారంతో గ్రామాన్ని సందర్శించారు. ఈయన వెంట సిఐ తిరుపతి, ఎస్ఐ బి.నీహార్ ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

ప్రజాశక్తి - గార

శ్రీకాకుళం నియోజకవర్గంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే గొండు శంకర్ శనివారం గార మండలం బందరువానిపేటలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి గ్రామంలో పల్లెనిద్ర చేసిన ఆయన ఉదయాన్నే బందరువానిపేట సముద్ర తీర ప్రాంతాన్ని పరిశీలించారు. రాత్రి వేటకు వెళ్లి తిరిగి ఉదయాన్నే తీరానికి చేరుకున్న మత్స్యకారులతో ఆయన మాట్లాడి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వసతి గృహంలో బాలికలతో కలిసి అల్పాహారాన్ని స్వీకరించిన ఆయన అనంతరం గ్రామంలో ప్రజలతో రచ్చబండ నిర్వహించారు. గ్రామంలో శ్మశానవాటిక, లైట్‌హౌస్, సముద్రతీర ప్రాంతం, పరిసరాల్లో రక్షణ గోడలు, శిథిలావస్థలో ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన ఆయన గ్రామ సమస్యలపై వారితో చర్చించారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

సముద్రంలోకి వెళ్లి చేపలను ఒడ్డుకు మోసుకొని వచ్చేందుకు వీలుగా జెట్టీ ఏర్పాటు చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి కుళాయి ఏర్పాటుతో పాటు గ్రామంలో ఇరుకైన ఇళ్లలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికోసం అనువైన స్థలాన్ని గుర్తించి అన్ని మౌలిక వసతులతో కూడిన కాలనీని నిర్మించనున్నట్లు తెలిపారు. ఆయనతో పాటు మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యం

మాట్లాడుతున్న వైసిపి నాయకులు

కొత్తూరు: ప్రజా పాలనలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని వైసిపి మండల కన్వీనర్ గండివలస ఆనందరావు అన్నారు. ఈ మేరకు శనివారం విలేకరులతో మాట్లాడుతూ విద్య, వైద్యం ఆరోగ్యం, వ్యవసాయం, తాగునీరు అందించడంలో ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదన్నారు. నిత్యవసర, గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. సంక్షేమ పథకాలు కేలెండర్ ప్రకారం అందజేశారని అన్నారు. మాజీ సిఎం జగన్ అనంతపురం జిల్లా రాప్తాడులో హత్య జరిగితే కార్యకర్తను పరామర్శకు వెళ్తే భద్రత కల్పించడంలో వైఫల్యం చెందిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలమైందన్నారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు చింతాడ సూర్యనారాయణ, తమ్మినాయుడు, ఎంపిటిసి వనుమ లక్ష్మీనారాయణ, ధూళి అప్పన్న, తిరుపతిరావు, పి.అశోక్‌కుమార్ ఉన్నారు.

నిందితుడిని ప్రవేశపెట్టిన ఎస్ఐ ముకుందరావు

గంజాయితో వ్యక్తి అరెస్టు

ఇచ్ఛాపురం : ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న బినేసెంట బాన్‌సింగ్‌ను శనివారం అరెస్టు చేసి ఆయన వద్ద నుంచి 16.330 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. నిందితుడు ఒడిశా గజపతి జిల్లాకు చెందిన వాడని అన్నారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు చేసి విచారణ చేపట్టామన్నారు. బాన్‌సింగ్ కుటుంబ పోషణకు డబ్బులు చాలక గంజాయి రవాణా చేద్దామని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఆలిగండలో టోప్పో వద్ద నుంచి గంజాయిని తీసుకొని దానిని తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్ నగరంలో టోప్పో సూచించిన వ్యక్తికి అందజేసేందుకు వెళ్తుండగా, పట్టుబడినట్టు తెలిపారు.

కొర్లాంలో కింగ్‌కోబ్రా

కింగ్‌కోబ్రా

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని కొర్లాం అయ్యప్ప దాబా వద్ద భారీ కింగ్ కోబ్రా సంచరించడంతో స్థానికులు తీవ్ర భయబ్రాంతులకు గురయ్యారు. సుమారు 15 అడుగులకు పైనే ఉన్న భారీ కింగ్ కోబ్రా శనివారం హల్‌చల్ చేసింది. దాబాలోకి ప్రవేశిస్తుండగా చూసిన దాబా యాజమాన్యం, సిబ్బంది, భయబ్రాంతులకు గురై స్నేక్ క్యాచర్ నర్సింగ్ మహాపాత్రోకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న స్నేక్ క్యాచర్ చాకచక్యంగా భారీ కింగ్ కోబ్రాను పట్టుకున్నారు. అనంతరం ఫారెస్టు ఆఫీసర్ జోగారావుకు చెప్పడంతో ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు జలంధరకోట రిజర్వు ఫారెస్టు సమీపంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

ట్రిపుల్ ఐటిలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం శ్రీకాకుళం ప్రాంగణం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వ్యాసరచనకు మహిళా అభ్యున్నతికి జ్యోతిరావు పూలే కృషి, అదే విధంగా అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అనే అంశాలపై పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 170 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 70 మంది వ్యాసరచన పోటీలో పాల్గొనగా, 100 మంది విద్యార్థులు టీంలుగా ఏర్పడి క్విజ్ పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులు వారిలో సృజనాత్మకత జోడించి ఆనాటి సమాజంలో సామాజికంగా అభివృద్ధికి పాటు పడిన మహనీయుల కృషిని తెలుసుకోవాలనే భావనతో ఈ పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఒ ముని రామకృష్ణ, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ గేదెల రవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డా.పెద్దింటి ముకుందరావు, ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

రికార్డును పరిశీలిస్తున్న అధికారులు

రేషన్ డిపో తనిఖీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ పరిధిలో 14, 15 వార్డుల్లోని రేషన్ పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మురళీధర్, ఆర్ఐ కంచరాన ఖగేశ్వరరావు శనివారం తనిఖీ చేశారు. విఆర్ఒ సహాయంతో రేషన్ డిపో డీలర్ పెంట రామరాజుకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. పది కేజీల బియ్యానికి కేజీ తక్కువగా కొలత వేసి ఇస్తున్నట్లు పెంట వెంకటరమణ, నారాయణ శెట్టి కృష్ణారావు, నారాయణ శెట్టి, శ్రీనివాసరావు, పోలవరం సతీష్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు తనిఖీ చేశారు. సరుకులు పరిశీలించి కేసు నమోదు చేశారు. శాఖాపరమైన చర్యలకు జెసి దృష్టికి తీసుకెళ్తామని వారు తెలిపారు. డీలర్ రామరాజు మాట్లాడుతూ రేషన్ వ్యాన్ ద్వారా ఇవ్వకుండా తనకు రేషన్ సరుకులు ఇవ్వాలని చెప్పడంతో రోజుకు ఒక వ్యక్తిని పెట్టి కూలీ డబ్బులు ఇస్తున్నానని తెలిపారు. ఆ డబ్బులు ఎవరు ఇస్తారు, అందుచేత అర కేజీ బియ్యం తక్కువ ఇస్తున్నానని చెప్పారు.

ఉన్నత విద్యకు విద్యార్థులు దూరం

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రాజశేఖర్

ఇంజినీరింగ్, డిగ్రీ, ఫార్మసీ, ఎంబిఎ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ బకాయిలను కూటమి సర్కారు చెల్లించని కారణంగా ఉన్నత విద్యకు విద్యార్థులు దూరమవుతున్నారని వైసిపి విద్యార్థి విభాగం ఎచ్చెర్ల నియోజకవర్గ అధ్యక్షులు ముద్దాడ రాజశేఖర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ పది నెలల పాలనలో విద్యార్థులకు ఫీజులు రాక ఉన్నత విద్యకు దూరమవుతున్నారని మండి పడ్డారు. గత బకాయిలు రూ.3,900 కోట్లకు ప్రభుత్వం కేవలం రూ.1300 కోట్లు మాత్రమే విడుదల చేసిందన్నారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి యువత పోరుకు పిలుపునిచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించిన తర్వాతే విడుదల చేసిందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుల కోసం యాజమాన్యాలు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. విద్యార్థులను యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతుంటే విద్యాశాఖా మంత్రి లోకేష్ నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, ఫీజుల కోసం విద్యార్థులను వేధించే కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలల విద్యార్థుల హవా

ప్రజాశక్తి- టెక్కలి

స్థానిక బిఎస్‌జెఆర్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపిటిసిలో హనుమంతు హేమంత్ (982 మార్కులు) సాధించి టెక్కలి పట్టణానికి ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల కరస్పాండెంట్ కోత మురళీధర్ తెలిపారు. బైపిసిలో సతివాడ కావ్య (981 మార్కులు) సాధించి ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో పందిరి ఢిల్లీశ్వరరావు (465 మార్కులు) సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, బైపిసిలో జలుమూరు ప్రవీణ (434 మార్కులు) సాధించి టెక్కలి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. విజేత విద్యార్థులను, ఇందుకు కృషి చేసిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావును మురళీధర్ అభినందించారు. అదేవిధంగా జెడ్‌పి హెచ్‌ఎస్ ప్లస్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో డి.స్ఫూర్తి (960 మార్కులు) సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.శోభారాణి తెలిపారు. బైసిపిలో జి.యోగేశ్వరి (960 మార్కులు), ఎం.రిషిత (914 మార్కులు), త్రివేణి (928 మార్కులు) సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసిలో ఎస్.శ్రీజ (460 మార్కులు), డి.వర్ష (452 మార్కులు), బైపిసిలో ఎం.శిరీష (388), తేజేశ్వరి (375) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారని తెలిపారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఇంటర్మీడియట్ ఫలితాల్లో ముందంజ ఉన్నామని కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వట్టికూళ్ల కిరణ్మయి తెలిపారు. తమ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిపి గ్రూపులో 123 మంది, బైపిసిలో 164 మందికి 126 మంది ఉత్తీర్ణత సాధించారని అన్నారు.

మోడల్ స్కూల్...

పోలాకి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 116 మంది పరీక్షలు రాయగా, 94 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 91 మంది హజరు కాగా, 85 మంది ఉత్తీర్ణ సాధించారని తెలిపారు.

బ్రాహ్మణతర్లాలో బాలికల సత్తా

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లా హైస్కూల్ ప్లస్ (బాలికల జూనియర్ కళాశాల) విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. జూనియర్ విభాగంలో 15 మంది విద్యార్థులకు 12 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 35 మందికి 31 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎంపిసిలో బి.పల్లవి 445 మార్కులు సాధించి హైస్కూల్ ప్లస్ టాపర్‌గా నిలిచింది. పి.ప్రశాంతి 429, బైపిసిలో ఎన్.మౌనిక 431, పి.రమ్య 412 మార్కులు సాధించగా, సీనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో ఎన్.మనీష 952 మార్కులు సాధించి హైస్కూల్ ప్లస్ టాపర్‌గా నిలిచింది. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణ, ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మధుబాబు, రమేష్, సుధాకుమారి, చంద్రశేఖర్, మెహర్ సుధ అభినందించారు.

పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రథమ, ద్వితీయ ఏడాది విద్యార్థులు తమ ప్రతిభను కనబరిచారు. ద్వితీయ ఏడాదిలో బైపిసి విద్యార్థిని నెయ్యిల మౌనిక 966, హెచ్‌ఇసి విద్యార్థులు రేణుకా సబర్ 924, చెలియా హేమావతి 910, ఎంపిసి విద్యార్థిని ఆర్.గౌరి 893, సిఎస్‌ఇ విద్యార్థిని జి.సౌజన్య 899, ఎలండ్‌టిలో బి.అఖిల 910, సిఇసిలో సవర నిఖిల 887, ప్రథమ ఏడాదిలో ఎంపిసి విద్యార్థి గౌతమ్ బెహరా 450/470, సిఎస్ఇ విద్యార్థిని ఎం.తపస్వి 473, హెచ్‌ఇసి విద్యార్థిని ఎస్.డేనియా ప్రీతి 462, సిఇసికి చెందిన సవర మీనాక్షి 449, ఎలండ్‌టిలో ఎస్.కార్తీక్ 454 మార్కులను సొంతం చేసుకున్నారని ప్రిన్సిపల్ కుప్పిలి నరసింహమూర్తి చెప్పారు.

గోవిందపురం...

వజ్రపుకొత్తూరు : ఇంటర్ ఫలితాల్లో పూండిగోవిందపురం ప్రభుత్వం జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కులు సాదించి ప్రభంజనం సష్టించారని కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.రమేష్ పట్నాయక్ అన్నారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో కోనారి అంజు 950, టెంక సంధ్య 909, ఎంపిసిలో కుసుమ 819, సిఇసిలో ఎస్.హరిక మార్కులు సాదించారన్నారు. ప్రథమ సంవత్సర ఎంపిసిలో గుంటు జాస్మిన్ 443, చాందిని 404, బైపిసిలో వంక తులసి 424, కిక్కిర కీర్తన 411, భార్గవి 404 మార్కులు సాధించారని అన్నారు. ప్రథమ సంవత్సరం సిఇసిలో వి.అర్పణ 430, హెచ్‌ఇసిలో కె.పూజ 413, ద్వితీయ సంవత్సరం హెచ్‌ఇసిలో టి.లిఖిత 735 మార్కులు సాదించుకున్నారన్నారు. ప్రథమ సంవత్సరంలో 12 మంది 400లకు పైగా మార్కులు సాధించారని అన్నారు. ద్వితీయ సంవత్సరంలో 8 మంది 900 మార్కులకు పైగా సాధించారని తెలిపారు.

వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ప్లస్ టూ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ తారకేశ్వర పండా తెలిపారు. ఎంపిసిలో బెహరా దీపికా, ఎంపిసిలో 911, మువ్వల అశ్విని 893, బైనపల్లి లక్ష్మి 848 మార్కులు సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సర ఫలితాల్లో 90 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక కస్తూరిబాగాంధీ కళాశాలలో బైపిసిలో జె.కోమలత 942 మార్కులు సాధించింది. గడ్డవలస దీపికా మొదటి సంవత్సరం బైపిసిలో 425 సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ కింతలి లక్ష్మీప్రసంతి, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన మొదటి సంవత్సరం ఎంపిసిలో జోగి నరేష్ 458, పైల వనిత మొదటి సంవత్సరం బైపిసిలో 428 మార్కులు, మోడి తులసి ద్వితీయ సంవత్సరం బైపిసిలో 961, ద్వితీయ ఎంపిసిలో వాసవి బాలమ్మ 925, మార్కులు సాధించారు. హెచ్‌ఇసిలో నూక గ్రీష్మ 861, సిఇసిలో వాసవి లిఖిత 845 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు.

కవిటి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంపిసిలో ఎల్.కృష్ణ 448, జి.ప్రసాద్ 427 మార్కులు సాధించారు. బైపిసిలో వై.పూజిత 403, ఐ.నీలిమ 401 మార్కులు సాధించారు. సిఇసిలో వై.చిన్ని 433, పి.వర్షిణి 416 మార్కులు, హెచ్‌ఇసిలో వై.సుశీల 451, టి.వనిత 324 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం బైపిసిలో పి.దివ్యభారతి 904, టి.అనీషా 824 మార్కులు సాధించగా, ఎంపిసిలో కె.సింహాచలం 937, బి.భాగ్యలక్ష్మి 923 మార్కులు, సిఇసిలో బి.దివ్యశ్రీ 849, ఎస్.సుందరరావు 847 మార్కులు, హెచ్‌ఇసిలో జి.చరణ్ 874, బి.ఝాన్సీ 841 మార్కులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పేడాడ రాజేశ్వరరావు తెలిపారు.

కెజిబివిలో..

మండలంలోని కొత్తపాలెంలో ఉన్న కెజిబివిలో మొదటి ఏడాది 82 శాతం, ద్వితీయ సంవత్సరం 95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ లక్ష్మి తెలిపారు.

కంచిలి : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఎస్.ఎం.ఎస్.పల్లి మోడల్స్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 70 శాతం, ద్వితీయ సంవత్సరం 92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ శివ ప్రసాద్ తెలిపారు. ఎంపిసిలో పి.పుష్ప 964, ఎల్.పూజ 954, బైసిపిలో ఎ.స్పందన 971, టి.పూజ 965 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో కె.మౌనిక 457, కె.అనూష 454, బైపిసి కె.సంతోషి 432, డి.లోలాక్షి 427 మార్కులు సాధించారు. కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ ఎంపిసిలో స్వాతి మహారాణ 936, బైపిసిలో బి.నందిని 927, ప్రథమ సంవత్సరం ఎంపిసిలో అంజలి బెహరా 456, నిర్మల బెహరా 453 మార్కులు సాధించారు.

భవానీ ధరణి తేజశ్వి పూర్ణ

నందిగాం : ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో కెజిబివి, అంబేద్కర్ బాలికల గురుకుల కళాశాలల విద్యార్థులు ప్రతిభకనబరిచారు. కెజిబివి ద్వితీయ సంవత్సరంలో 30 మందికి గాను, 30 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరంలో 34 మందికి, 33 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ కె.జ్యోతి తెలిపారు.

సోంపేట : ఇంటర్ ఫలితాల్లో కెజిబివి వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. బైపిసి ద్వితీయ సంవత్సరంలో దున్న ధనలక్ష్మి 969 మార్కులు, సోంపేట మోడల్ స్కూల్ ప్రథమ సంవత్సరంలో 63 శాతం, ద్వితీయ సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ చెన్నజివర్మ తెలిపారు. ద్వితీయ సంవత్సరం బైపిసిలో బి.మౌనిక 908, ఎంపిసిలో పూజ 960 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపిసిలో ఎం.జ్యోతి 433, బైపిసిలో జి.సంధ్య 410, సిఇసిలో పి.పల్లవి 437 మార్కులు సాధించారు.

కొత్తూరు : ఇంటర్ ఫలితాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 143 మందికి గాను, 104 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ ఇంటర్‌లో కొమనాపల్లి సరిత 940, మంతెన బాలామణి 922, బైపిసిలో కారక అక్షయ 963, బరాటం మేఘన సిఇసిలో లావేటి స్రవంతి 850, వర్ణాన అశ్విని 854, హెచ్‌ఇసిలో బొంతు ఝాన్సీ 773, ఘంట చరణ్ 767, ఒఎస్‌లో కోడూరు శ్రీదేవి 950, పల్లి పవిత్ర 911, గొర్ల జ్ఞానేశ్వర్ 958 మార్కులు సాధించనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బండారు రవికుమార్ తెలిపారు.

మెళియాపుట్టి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరంలో 93 మందికి 509 మంది పాసైయ్యారు. బైసిపిలో తరుణ్‌కు 918 మార్కులు లభించాయి. పెద్దమడి ఎపిఆర్‌జెసిలో ద్వితీయ సంవత్సరంలో 74 మందికి 47 మంది ఉత్తీర్ణులయ్యారు. బైపిసిలో ఎం.జీవన్‌కు 911 మార్కులు లభించాయి. మెళియాపుట్టిలోని కెజిబివిలో 30 మందికి 27 మంది ఉత్తీర్ణత సాధించారు. బైపిసిలో ఎస్.దేవక 924 మార్కులు లభించాయి. చాపర ఎస్‌కెకె ప్రయివేటు కళాశాలలో బైపిసిలో టి.మనీషకు 911 మార్కులు లభించాయి.

రణస్థలం : ఇంటర్ మీడియట్ ఫలితాల్లో కొండములగాం మోడల్ కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం 84 శాతం ఫలితాలు సాధించారు. రెండో సంవత్సరం 93.4 శాతం ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో కె.స్వాతి 967, కె.దివ్య 967, పి.శ్రీవర్ష 951, బైపిసీలో ఎల్.పల్లవి 967, ఆర్.అనుశ్రీ 966, జి.వైశాలి 946, ఎంఇసిలో కె.జాహ్నవి 824, సిఇసిలో ఎం.తేజేశ్వరరావు 859, జి.కావ్య 751, బి.రమా 576, జూనియర్ ఇంటర్‌లో ఎంపిసిలో సుఫియా షాహిన్-463, సి.హెచ్.చరిష్మా-458, డి.స్రవంతి 456, బైపిసిలో జి.మోహిని 428, వి.భాను 426, ఎం. శృతి 421, సిఇసిలో కె.కావ్య 376, ఎస్.కృష్ణకుమారి 292, కె.సాయి కార్తీక్ 263 మార్కులు సాధించారు.

లావేరు: మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో 39 మంది పరీక్షలు రాయగా 36 మంది 92.3 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఎ.సాయిదుర్గ 444 అత్యధిక మార్కులు సాధించినట్టు పాఠశాల ప్రత్యేకాధికారి బల్ల సుధ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 36 మందికి గాను 31 మంది 86.శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో 884 మార్కులు సిహెచ్ హేమ లత సాధించినట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ సుధ ఉపాధ్యాయులను అభినందించారు.

మండలం గురుగుబిల్లి గ్రామానికి చెందిన లుట్ట భవానీ ఇంటర్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపిసిలో 440 మార్కులకు 427 మార్కుల సాధించింది. లావేరు ప్రభుత్వం కళాశాలలో చదువుకుంటున్న భవానీ తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. భవానీ ఎనిమిదో తరగతిలో చదువుని మధ్యలో ఆపేసి కూలి పనులకు వెళ్తూ ఓపెన్ టెన్త్ కట్టి పాసై ఇంటర్‌లో మంచి మార్కులు సాధించినందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

మెరిసిన మోడల్ స్కూల్ విద్యార్థులు

జి.సిగడాం: స్థానిక ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ లంక అన్నా శ్యామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు బైపిసి విభాగంలో జి.సంజన 427/440, ఎంపిసి విభాగంలో జె.గాయిత్రి 449/470, ఎంఇసి విభాగంలో ఎస్.హారిక 426/500 సిఇసి విభాగంలో పి.అమృత 464/500 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసి విభాగంలో ఎల్.రాజు, కె.కీర్తన 954/1000, బైపిసి విభాగంలో ఎన్.హారిక 939/1000, సిఎచ్ హరిక 915/1000, హెచ్‌ఇసిలో పి.తారక 881/1000 మార్కులు సాధించారు. వీరందరిని ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు. స్థానిక జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 86 శాతం ఉత్తీర్ణత, ద్వితీయ సంవత్సరం ఉత్తీర్ణత 87 శాతం సాధించారని ప్రిన్సిపాల్ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కెజిబివిలో ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ ప్రమీల తెలిపారు.

బూర్జ: ఇంటర్ ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో మండలంలోని ఓవిపేట మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో చింతాడ అనన్యశ్రీ 470 మార్కులకు 455 మార్కులు సాధించింది. అలాగే గోకిన అనుష్క 440 మార్కులకు 426, యెన్ని హిమశ్రీ 384/500, చిగురుపల్లి తనుశ్రీ 412/500 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో విద్యార్థులు టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. ఇందులో కర్ని ధరణి సెకండ్ ఎంపిసిలో 984/1000, చీర హారిక బైపిసిలో 966/1000, సిఇసిలో అల్లబోయిన భవాని 888/1000 మార్కులు సాధించినట్లు తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో 68.48 శాతం. సెకండ్ ఇంటర్‌లో 67. 62 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆయనతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎస్.తవిటినాయుడు తెలిపారు. 67.2 శాతం ఫలితాలు సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

అలాగే కొల్లివలస డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాలలో ద్వితీయ సంవత్సరంలో 69 మంది విద్యార్థులకు 67 మంది ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరం 72 మంది విద్యార్థులకు 66 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డి. దేవేందర్ తెలిపారు.

పొందూరు: ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో విద్యార్థులు తమ సత్తా చాటారు. మండలంలోని గోరింటకు చెందిన చింతాడ తేజశ్వి ద్వితీయ సంవత్సరం బైపిసిలో 1000 మార్కులకు 985 మార్కులను సాధించింది. ఈమె రాజమండ్రిలోని శశి విద్యాసంస్థల్లో చదువుతుంది. ఈమె తల్లిదండ్రులు చింతాడ శ్రీలక్ష్మి సర్పంచ్ కాగా, తండ్రి కృష్ణవాసుదేవరావు ప్రస్తుతం టిడిపి నియోజకవర్గం బిసిసెల్ అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. లోలుగు కెజిబివిలో ప్రథమ సంవత్సరం 39 మందికి గాను 38 మంది పాసై 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో జి.జ్యోత్స్న 423/440 మార్కులు సాధించింది. ద్వితీయ సంవత్సరంలో 32 మందికి 31 మంది పాస్ కాగా 98 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో సి.యామిని 966/1000 మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ రేజేటి సౌమ్య తెలిపారు. అలాగే ఎపి మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సరం 72 మందికి 57 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 76 మందికి 65 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రథమ సంవత్సరం బైపిసిలో ఎం.తేజ 429 మార్కులు, ఎంపిసిలో ఎ.పద్మ 452 మార్కులు, సిఇసిలో వై.ఢిల్లీశ్వరి 470 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం ఎంపిసిలో ఎస్.శ్రావణి సంధ్య 973 మార్కులు, బైపిసిలో జి.దేవి 969 మార్కులు, సిఇసిలో జి.జయశ్రీ 769 మార్కులు, ఎంఇసిలో పి.లావణ్య 801 మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ తెలిపారు. పొందూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 174 మందికి 112 మంది పాస్ కాగా 65 శాతం ఉత్తీర్ణతను సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరంలో 184 మందికి 76 మంది పాస్ కావడంతో 43 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఇందిర తెలిపారు.

ఆమదాలవలస: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక మార్కుల సాధించారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో జి.మౌనిక 470 మార్కులకు 436 మార్కులు సాధించింది. బైపిసిలో కె.నక్షత 440 మార్కులకు 422 మార్కులు, హెచ్‌ఇసిలో కె.రాజేశ్వరరావు, సిఇసిలో వి.వెంకటేష్ 500 మార్కులకు 335 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపిసిలో డి.బాలాజీ 966/1000, బైపిసిలో తాన్ని పూర్ణ 976/1000, హెచ్‌ఇసిలో పి.వనజ 853/1000, సిఇసిలో జి.భవాని 725/1000 మార్కులు సాధించారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ అనిత

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె.అనిత వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పురుషోత్త పురంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డయేరియా కేసుల వివరాలు సేకరించారు. గ్రామ ంలో మూడు రోజులు వైద్య శిబిరం కొనసాగించాలని వైద్యాధికారికి సూచించారు. జ్వరాలు, ఇతర వ్యాధులపై ఇంటి సర్వే చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఖాళీగా ఉన్న ఎఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయించాలని గ్రామస్తులు డిఎంహెచ్‌ఒకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ జూహిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న హెచ్‌ఎం కళావతి

విద్యతోనే ఉన్నత స్థాయికి...

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విద్య ద్వారా ఉన్నత స్థాయికి ఎదిగారని ప్రధానోపాధ్యాయులు నగిరి కళావతి అన్నారు. మండలంలోని డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కులం, మతం, లాంటి అమానవీయ భావజాలం కంటే విద్య ఎంతో గొప్పదని, అందుకు అంబేద్కర్ ఉదాహరణగా చెప్పుకోవచ్చని అన్నారు. ఉపాధ్యాయులు కలం గళం క్రియేషన్స్ దుర్యోధన మాస్టర్ పాటలతో చిన్నారులను ఆనందింపజేస్తూ చైతన్యపరిచారు. రాజ్యాంగాన్ని చిన్నతనం నుంచే విద్యార్థులు రోజూ చదవాలని ఎంపిటిసి ప్రతినిధి కొయిరి ఢిల్లీరావు అన్నారు. గ్రామ అధ్యక్షులు పల్లేటి మోహన్ మాట్లాడుతూ అంబేద్కర్ అందరికి ఆదర్శప్రాయులని కొనియాడారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ మడ్డు నారాయణస్వామి, ఉపాధ్యాయులు తేజేశ్వరి, దేవి, లావణ్య, పల్లేటి తిరుపతిరావు పాల్గొన్నారు.

మావయ్య అండతో...

సందీప్

వజ్రపుకొత్తూరు: చిన్నతనంలోనే తల్లితండ్రులు చనిపోయినా మామయ్య అండతో ఇంటర్ ఫలితాల్లో 976 మార్కులు సాధించి తమ ప్రతిభ కనబరచి తన సత్తా చాటిన నువ్వలరేవు యువకుడు బెహరా సందీప్‌ను సర్పంచ్ పూర్ణచంద్రరావు అభినందనలు తెలిపారు. తండి బెహరా బికారి, తల్లి భాను విద్యార్థి చిన్నతనంలోనే చనిపోయారు. మామయ్య బైనపల్లి తేజేశ్వరరావు చేరదీసి చదువు చెప్పించారు. పదో తరగతి వజ్రపుకొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో చదివి 538 మార్కులు సాధించాడు. దీంతో విద్యార్థి ప్రతిభ గుర్తించిన మామయ్య ఇంటర్ ప్రయివేటు కళాశాలలో చేర్పించాడు. విద్యార్థికి పంజాబ్‌లోని లవ్లీ అని యూనివర్సిటీలో ఫ్రీ అడ్మిషన్ ఆఫర్ వచ్చిందని తేజేశ్వరరావు తెలిపారు.

రగ్బీ జిల్లా జట్టు పయనం

టెక్కలి : ఈ నెల 14 నుంచి 16 వరకు అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో పాల్గొన్నందుకు జిల్లా జట్టు శనివారం పయనమైంది. ఈ మేరకు జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డొంకాన రామకృష్ణ, పొన్నాడ పార్వతీశంలు జిల్లా జట్టుని అభినందించారు. విజేతలుగా తిరిగి వచ్చే జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేయాలని కోరారు. అభినందనలు తెలిపిన వారిలో అసోసియేషన్ నిర్వాహకులు బాడన నారాయణరావు, కె.కె.రామ్‌రెడ్డి, లక్ష్మణ్ రాజా, కాపల రఘునాథరావులు ఉన్నారు.

గాంధీ పరామర్శ

ప్రజాశక్తి- బూర్జ

ఆమదాలవలస నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ మండలం, కొల్లివలస గ్రామానికి చెందిన సైరిగాపు కృష్ణను శనివారం పరామర్శించారు. కృష్ణ కుమార్తె శ్రావణి ఇటీవల మృతి చెందింది. ఈ సందర్భంగా వారి కుటుంబాన్ని గాంధీ పరామర్శించారు. అయనతో పాటు సైరిగాపు శివ, పి.సూర్యారావు, పి.విజయ్, ఎం.ధర్మ, శివ, వై.గోపాల్, ఆదినారాయణ, మోహన్ చౌదరి, భాస్కర్, జనార్ధన్, రాము, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

కవిటి: కవిటి రఘునాథ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా శనివారం రాత్రి నిర్వహించిన గాత్ర కచేరి అలరించింది. వేడుకలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్న దాన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి అందజేత

రణస్థలం రూరల్: మండలంలోని కమ్మ సిగడాంకు చెందిన మన్నె రమేష్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అత్యవసర చికిత్స కోసం సిఎం సహాయ నిధికి ఇటీవల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు ద్వారా దరఖాస్తు చేసుకోగా శనివారం ఆయనకు రూ.5 లక్షలు మంజూరు చేస్తూ వచ్చిన పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకుల సమక్షంలో వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చటం కోసం సిఎం చంద్ర బాబు అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. లంక శ్యామలరావు, వెలిచేటి సురేష్ కుమార్, బెండు మల్లేశ్వరరావు, కుమరాపు రవికుమార్, సంపతరావు నాగేశ్వరరావు, నసపల రామారావు, వావిల పల్లి రామకృష్ణ, డబ్బాడ ఆది నారాయణ, గోపీన కృష్ణారావు, కరాటే లక్ష్మణ్ పాల్గొన్నారు.



సహాయనిధి పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఉద్దానంలో కొబ్బరి పంటపై వ్యాప్తి చెందిన తెల్ల దోమపై నివారణ చర్యలు తీసుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్ కుమార్ కోరారు. ఈ మేరకు జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్దానంలో కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాలు, పరిసర ప్రాంతాల్లో తెల్ల దోమ వల్ల కొబ్బరి పంట దిగుబడి తగ్గి రైతులు పూర్తిగా నష్టపోయారని అన్నారు. జీడి, మామిడి పంటలు పూత దశలో ఆశా భంగం కలగడంతో వాటిపై కూడా తెల్ల దోమ ప్రభావం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు.

జెసికి వినతిపత్రం అందజేస్తున్న కిరణ్‌కుమార్

వీటిపై పరిశోధన చేయాలని విన్నవించారు. తెల్ల దోమపై ప్రభుత్వం డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేయాలన్నారు.

అంబేద్కర్ జయంతిని విజయవంతం చేద్దాం

టెక్కలి : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఎపి దళిత మహాసభ జిల్లా అధ్యక్షులు బోకర నారాయణరావు ఒక ప్రకటనలో కోరారు. ఏటా జయంతి ఉత్సవాలు నిర్వాహాల్లో అరకొరగా నిర్వహించారని గుర్తు చేశారు. ఈసారి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సెలవ దినాలని ప్రకటించిన నేపథ్యంలో తప్పనిసరిగా ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాల్ని నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్‌పిలు ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు.

కోటబొమ్మాళి: ఈనెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి వేడుకలను విజయవంతం చేద్దామని మండల అంబేద్కర్ సేవా సమితి అధ్యక్షుడు బోకర జడ్డెన్న, ప్రధాన కార్యదర్శి డి.సింహాచలంలు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్దకు తరలిరావాలని కోరారు.

టిటిడి గోశాలపై వైసిపి అసత్య ప్రచారం

మాట్లాడుతున్న పిఎంజె బాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరుమల తిరుపతి దేవస్థానంలో యాత్రికులకు సౌకర్యాలు మెరుగు పర్చడంతో వివిధ ప్రక్షాళన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, దీంతో వైసిపి నాయకులు జీర్ణించుకోలేక మళ్లీ దేవస్థానంపై విషపు ప్రచారాలకు సిద్ధమయ్యారని టిడిపి ఉపాధ్యక్షులు పిఎంజెబాబు ధ్వజమెత్తారు. శనివారం నగరంలోని టిడిపి జిల్లా కార్యలయంలో బిసి రాష్ట్ర సాధికారిక డైరెక్టర్ కోమనాపల్లి వెంకటరామరాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. టిటిడి చైర్మన్‌గా గతంలో పని చేసిన భూమన కరుణాకరరెడ్డి అలజడి సృష్టించడానికి కుట్రచేస్తున్నారన్నారు. తిరుమల గోశాలలో వంద ఆవులు చనిపోయినట్టు అలజడి సృష్టిస్తున్నారన్నారు. ఇది కేవలం మతవిద్వేషాలను రెచ్చగొట్టే చర్యని విమర్శించారు. టిటిడి పర్యవేక్షణపై తప్పుడు ప్రచారం చేసి లబ్ధి పొందాలన్న ఆలోచన సరికాదన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘంలో మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని మాజీ మున్సిపల్ చైర్మెన్ తమ్మినేని గీత అన్నారు. శనివారం పురపాలక సంఘంలోని 17వ వార్డు పరిధిలోని పూజారిపేటలో 15వ ఆర్థిక సంఘం నిధులతో కొత్తకోట వారి వీధి జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు రూ.18.5 లక్షలతో సిసి కాలువ, అలాగే వెంకటేశ్వర కళ్యాణ మండపం పక్కన మరో నాలుగు లక్షలతో సిసి కాలువ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే రవికుమార్ చొరవతో పురపాలక సంఘానికి నిధులు మంజూరై అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి కార్యాలయ



కాలువలకు శంకుస్థాపన చేస్తున్న గీత

కార్యదర్శి మొదలవలస రమేష్, పట్టణ టిడిపి అధ్యక్షుడు సంపదరావు మురళి, పివివికె రాజు, కూన ఆంజనేయులు, కూన రాము, చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), బగాది భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక అభివృద్ధి

ప్రజాశక్తి- పలాస

మండలంలోని బ్రాహ్మణతర్లలో శ్మశాన వాటికను టిడిపి నాయకులు శుభ్రం చేశారు. పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కూటమి నాయకులు ప్రొక్లెయినర్‌తో వాటిని తొలగించారు. కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల వెంకటరావు, వడ్డి యాదగిరి, బమ్మిడి ఆనందరావు, ఆళ్ల కృష్ణారావు, సల్ల విశ్వనాథం, నిల్ బ్రహ్మ పాల్గొన్నారు.

ముళ్ల పొదలను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

ఘనంగా పక్షోత్సవాలు

కొత్తూరు : కొత్తూరు అంగన్వాడీ కేంద్రంలో శనివారం అంగన్వాడీ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ పిఒ విమలాకుమారి మాట్లాడుతూ పిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారం అందించే సంకల్పంతో పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజ్ సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న మర్రిపాడు గ్రామస్తులు

బాధితునికి ఆర్థికసాయం

నౌపడ : సంతబొమ్మాళి మండలం మర్రిపాడు గ్రామస్తులు రోడ్డు ప్రమాద బాధితునికి వైద్య ఖర్చులకు శనివారం రూ.80,600 ఆర్థికసాయం అందించారు. రణస్థలం మండలం రామచంద్రాపురానికి చెందిన ఎస్.వి.రమణ ఇటీవల రణస్థలం వద్ద రోడ్డు ప్రమాదానికి గురై విశాఖలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో బాధతుడి వైద్య ఖర్చులకు డబ్బులు ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకుని బాధితుడు అత్త గ్రామం మర్రిపాడులో గ్రామస్తులు విరాళాలు సేకరించారు. సహకరించిన విరాళాలను పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు ఆటాడ రాంప్రసాద్, సర్పంచ్ ఆట్టాడ కల్పనలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

16న మండల సమావేశం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 16న బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి తమ్మినేని శారద అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ రోణంకి వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం ప్రారంభం కానుందని, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు హాజరు కావాలని కోరారు. సంబంధిత అధికారులు సమగ్ర సమాచారంతో విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్వాతి

గాయకుడు ఆనంద్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సంగీత ప్రియులకు స్వరమాధురి ద్వారా సుమధుర సంగీతాన్ని అందించిన నేపథ్య గాయకుడు స్వర్గీయ జి.ఆనంద్ అని ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి అన్నారు. శనివారం నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా నేపథ్య గాయకునిగా సుపరిచితుడైన ఆయన 300కుపైగా చలన చిత్రాలకు నేపథ్యగానం అందించారన్నారు. అటువంటి వ్యక్తి జిల్లాలోని హిరమండలం మండలం తులగాంలో 1944లో జన్మించారన్నారు. ఆయన సోదరుడు గేదెల రమేష్ ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో వావిలపల్లి జగన్నాథ నాయుడు, కొండాల గణేష్, కరణం శ్రీనివాస్, లుకలాపు గోవిందరావు, తర్లాడ అప్పల నాయుడు, గేదెల జగన్మోహనరావు, డోల జగన్, గేదెల కృష్ణ, శాసపు జోగి నాయుడు, పాండ్రంకి మోహన్ తదితరులు పాల్గొన్నారు.